నేడు యథావిధిగా

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

పనిగంటల పెంపుపై

టిడిపి, వైసిపి విధానాలు ఒక్కటే

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

పని గంటలకు పెంపు అంశంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి విధానం ఒక్కటే అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనిగంటల పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వైసిపి వాకౌట్ చేయడం ద్వారా మద్దతు తెలియజేసిందే తప్ప వ్యతిరేకించలేదని పేర్కొన్నారు. కార్మికుల శ్రమను దోచే పనిగంటల పెంపును తక్షణం రద్దుచేయాలని, మహిళలచే రాత్రి వేళల్లో పనిచేయించడం మానుకోవాలాంటూ డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుని కైనా కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి పని గంటల పెంపు నిర్ణయం మరణ శాసనంగా మారుతుందన్నారు. మూడు షిఫ్టులు, రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతీ ముగ్గురిలో ఒకరి ఉపాధి పోతుందని, నిరుద్యోగులకు ఉపాధి అనేది కలగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పగలే మహిళలకు రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం రాత్రి వేళల్లో వారితో పనిచేయించడం మానుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త సర్వేలో అధిక పని గంటలవల్ల 30 శాతం కార్మికులలో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయని, సుదీర్ఘ పని గంటల వల్ల కార్మికుల మానసిక సమస్యలు పెరుగుతాయని, సరుకుల క్వాలిటీ పడిపోయి అంతర్జాతీయ పోటీలో నిలబడ లేకపోతున్నాయని తెలిపిందన్నారు. కార్మికుల కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయం వల్ల చిన్నాభిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం ఉన్నప్పుడే అనేక పరిశ్ర మల్లో 12 గంటలు పనిచేయించారని, అధికారికంగా 12 గంటలు చేస్తే కార్మికులతో యజమాన్యాలు 14, 16 గంటలు పనిచే యించుకుని బానిసలుగా మారుస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దుచేయకపోతే పోరాటాలకు కార్మికులు, ఉద్యోగులు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ట్రంప్ సుంకాలను తిప్పి కొట్టడితే ధరలు అదుపులో ఉంటాయని తెలిపారు. త్వరలో 12 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం దీర్ఘకాలిక ఐక్య పోరాటాలు చేయడంలో సిఐటియు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు కోశా ధికారి హరిశర్మ, జిల్లా కార్యదర్శి డి. భాగ్య లక్ష్మి, మెహరున్నిసా, ఉపాధ్యక్షులు వెంక ట్రామయ్య, ఓబుళమ్మ రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి

జిల్లా రవాణా అధికారి కె.ప్రసాద్

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, రోడ్డు భద్రత ప్రమాదాల నివారించాలని జిల్లా రవాణా అధికారి కె.ప్రసాద్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనదారులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, లైసెన్సులు ఎలా పొందాలి, తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాల్లో రవాణా కార్యాలయాల వివరాలు తెలియజేయండి ?

జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం, మదనపల్లిలో ఆర్‌టిఒ కార్యాలయాలు, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలున్నాయి.

పాఠశాలల బస్సులకు ఎలాంటి నిబంధనలు పాటించాలి ?

పాఠశాల బస్సు డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనల కాపీని జతపరచాలి. 750కిలోలకు పైగా బరువు ఉంటే హెవీ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఐదు సంవత్సరాలు అనుభవం ఉండాలి. 60 సంవత్సరాల దాటిన వ్యక్తి డ్రైవింగ్ చేయకూడదు. బస్సులకు పసుపు కలర్ రంగు ఉండాలి. చిల్డ్రన్స్ బొమ్మలు కూడా ఉండాలి. డోర్ పక్కన పాఠశాల అడ్రస్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే బస్సులో ఎమర్జెన్సీ దారి ఏర్పాటు చేసుకోవాలి. డ్రైవర్ వెనుక భాగంలో రూట్ మ్యాప్ ఉండాలి. 15 సంవత్సరాలు పూర్తయిన వాహనానికి తిప్పకూడదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి డ్రైవర్ మెడికల్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి.

అధిక చార్జీలు వసూలు చేసేవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రవాణాశాఖ మొత్తం 661 చలానా నమోదు చేసి రూ.63,74375 జరిమానా విధించాం. వాహనదారులు పన్ను సకాలంలో చెల్లించాలి. మోకానికి సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ తమ వంద ఉంచుకోవాలి ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయి. అధిక చార్జీలు వసూలు చేసే వారి పైన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేశాం. రోడ్ టాక్స్‌లు చెల్లించకపోవడం, పర్మిట్ లేకుండా తిరగడం, అనుమతులు లేకుండా సరుకులు రవాణా చేయడం, ప్రయాణకుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం, రెండో డ్రైవర్ లేకపోవడం వంటివి చట్ట విరుద్ధం. ఇప్పుడు వరకు ప్రయివేట్ బస్సులపై కేసులు నమోదు చేశాం.

డ్రైవింగ్ లైసెన్స్ ఏ పద్ధతిలో మంజూరు చేస్తున్నారు ?

డ్రైవింగ్ లైసెన్స్‌లో పొందడానికి రెండు దశలున్నాయి. తాత్కాలిక లైసెన్స్ పొందడం, శాశ్వత లైస్ గురించి పొందడం. మాన్యువల్ టెస్టింగ్ స్థానంలో కొత్తగా సాంకేతిక విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించాయి. డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానంలో కొత్త మార్పులను తీసుకొస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మోటర్ వెహికల్ చట్టానికి అనుకులంగా లైసెన్సులు జారీ చేస్తున్నాం. ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఎపి ఆర్‌ఎ డాట్ సిటీజన్‌లో చలానా కట్టుకోవాలి. లేకపోతే మీ సేవలో చలానా కట్టుకొని కట్టుకోవాలి. 18 సంవత్సరాల పూర్తయిన వారు మాత్రమే అర్హులు. రవాణా అధికారుల పర్యవేక్షణలో డ్రైవింగ్ విధానాన్ని వాహనదారుడూ వాహనాన్ని నడిపితే ఆర్‌టిఒ సంతృప్తి చెందుతూ అతనికి లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్సులను కూడా ఇంటికి పంపిస్తున్నాం. 50 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉన్న వారు నాన్ ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ కోసం దరఖాస్తుదారుడికి మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేదు. 50 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. లైసెన్స్ కోసం దరఖాస్తుదారులకు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు గుర్తులు ఇతర ముఖ్యమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి లైసెన్స్ పొందిన 30 రోజుల్లో తర్వాత పర్మినెంట్ లైసెన్స్ కోసం అప్లయ్ చేయాలి.

ఫెయిల్ అయినా అభ్యర్థి ఎన్ని రోజులలో తిరిగి డ్రైవింగ్ టెస్టు హాజరు కావాలి?

ఫెయిల్ అయిన అభ్యర్థి ఏడు రోజులకు డ్రైవింగ్ టెస్ట్‌కు రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. ఫెయిల్ అయిన అభ్యర్థి ఒక నెల తర్వాత దరఖాస్తు చేసుకోవాలి. నెల లోపల వాహనదారుడు డ్రైవింగ్ శిక్షణ తీసుకుని హాజరుకావాలి.

రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నెలకొకసారి కలెక్టర్ అధ్యక్షతన ఎసిపి ఇతర శాఖలతో ప్రమాదాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు అరికట్టడానికి స్కూల్, కాలేజ్ డ్రైవింగ్ స్కూల్‌లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం.పదేపదే ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశంలో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు నెలలో రోడ్డు భద్రత వారోత్సవాలను కూడా నిర్వహిస్తున్నాం.

డ్రైవర్లకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తి మాత్రమే వాహనాలను నడపాలి. వాహనం నడుపుతున్న ప్రతి డ్రైవరూ ట్రాఫిక్ నియను నిబంధన పాటించాలి. మద్యం సేవించి వాహనం నడవరాదు. మద్యం సేవించి వాహనదారుడు వాహనాన్ని నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం. ద్విచక్ర వాహనం వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. అలాగే వాహనదారులు సీటు బెల్టు ధరించి ధరించాలి. ఎనిమిది గంటల ప్రయాణం దాటితే 2వ డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో ప్రయాణాలు నివారించాలి. అత్యంత పరిస్థితిలో మాత్రమే ప్రయాణించాలి. 50 సంవత్సరాల దాటినవారు తప్పనిసరి కంటి పరీక్షలు చేయించుకుని డ్రైవింగ్ చేయవలెను. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అందరూ సహకరించాలి.

మదనపల్లె జిల్లా హామీ ఏమైందీ?

సిఎం చంద్రబాబు, లోకేష్‌ను ప్రశ్నించిన జిల్లా సాధన సమితి

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పిటియం శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరునెలల్లోనే, మదనపల్లె జిల్లా ఏర్పాటు చేసి, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ ఏమైందని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీయం శివప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక జిఆర్‌టి ఉన్నత పాఠశాల నందు మలిదశ మదనపల్లె జిల్లా ఉద్యమ సన్నాహక సమావేశం జరిగింది. మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బిటి కళాశాల కరస్పాండెంట్ వై.ఎస్. మునిరత్నం, విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రెడ్డిసాహెబ్, సిపిఐ రాష్ట్ర నాయకుడు తోపు కృష్ణప్ప, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, బహుజన సమాజ్ పార్టీ పుంగనూరు నియోజకవర్గ నాయకుడు అడ్వకేట్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ మదనపల్లె జిల్లా సాధన కోసం, తొలివిడతలో 633 రోజుల పాటు సాగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అందరికీ అభినందనలు తెలిపి, వారందర్నీ మలిదశ ఉద్యమంలోకి ఆహ్వానించడానికి, మదనపల్లె జిల్లా ఉద్యమ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తొలి విడతలో జరిగిన మదనపల్లె జిల్లా ఉద్యమం, రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపిందని, దీంతో అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు, నారా లోకేష్ దీనిపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. మదనపల్లెలో జరిగిన మినీ మహానాడులోనూ, బెంగళూరు బస్టాండ్ వద్ద జరిగిన ఎన్నికల బహిరంగ సభలోనూ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మదనపల్లె జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించగా, యువగళం పాదయాత్ర సందర్భంగా పీలేరు, మదనపల్లెల్లో జరిగిన సభల్లో నారా లోకేష్ తమ ప్రభుత్వం రాగానే మొదటి ఆర్నెళ్లలోనే మదనపల్లె, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా, ఎమ్మెల్యే షాజహాన్ బాషా అసెంబ్లీలో మూడుసార్లు మదనపల్లె జిల్లా కోసం డిమాండ్ చేసినా, చంద్రబాబు, లోకేష్ స్పందించకపోవడం తో మదనపల్లె ప్రజల్లో ఆందోళన ఎక్కువైందన్నారు. మలిధశ ఉద్యమంలో పేస్ బుక్, యూట్యూబ్, ట్విట్టర్, వాట్సాప్, ఎక్స్, టెలిగ్రామ్, షార్ట్ ఫిలిమ్స్ ద్వారా మదనపల్లె జిల్లా ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేయాలని నెటిజెన్లకు పిలుపునిచ్చారు. రెండు నెలల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆతర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్, జనగణన మొదలౌతుందని ఆ సమయంలో జిల్లా ఏర్పాటు సాధ్యం కాదని చెప్పారు. ఈ సమావేశంలో తంబళ్లపల్లి నాయకులు కె.వి. రమణ, మనోహర్‌రెడ్డి, పుంగనూరు నాయకుడు అడ్వకేట్ శ్రీనివాసులు, పీలేరు నాయకుడు నాగరాజు, మదనపల్లె నాయకులు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్, చైతన్య సొసైటీ నిర్వాహకుడు చరణ్, బాస్ నాయకులు పీర్ బాషా, వై. గంగాధర్, తలారి కృష్ణ, బహుజన సేన నాయకులు జయన్న, భాను, వెంకీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మిట్స్' ప్రొఫెసర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ అసోసియేట్ డీన్ ఆర్‌డి డాక్టర్ శివయ్యకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2025 సంవత్సరానికి గాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచంలోని టాప్2 శాస్త్రవేత్తల జాబితాలో ఆయనకు చోటు దక్కింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ పరిశోధన రంగంలో చేసిన విశిష్ట కృషికి గాను ఈ ఘనత సాధించారని తెలిపారు. ప్రొఫెసర్ శివయ్యను యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సులర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సులర్ ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఆర్ అండ్‌డి అడ్వైజర్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అంతర్జాతీయ గుర్తింపు పత్రాన్ని చూపుతున్న శివయ్య

డిజిటల్ యాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

డిజిటల్‌బుక్ యాప్‌తో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డిజిటల్ బుక్ యాప్‌తో వైసిపి కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు మాజీ సిఎం వై.ఎస్.జగన్ 2.0 అమలుకు నాంది పలికారని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అండగా నిలబడిన కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులు, దౌర్జన్యాలు, అన్యాయాలకు రక్షణగా డిజిటల్ బుక్ ఉంటుందన్నారు. డిజిటల్ బుక్‌లో ప్రతి వైసిపి కార్యకర్త తమ మనోభావాలను, ఇబ్బందులు నమోదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనుజారెడ్డి, ఎపి ఎండిసి మాజీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు శీలం రమేష్, అనంత మునిశేఖర్, కొత్తపల్లి మహేష్, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్ నాయక్, మాజీ సైనికులు చిప్పిలి మల్లికార్జునరెడ్డి, చరణ్, చిన్న,రమేష్, ఇర్ఫాన్, రఫి, అమ్మజాన్, షమా, నాగమణి, వినుతాబాయి, శారదరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు సహించం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సిఎం జగనన్నపై అనవసరపు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మదనపల్లి వైసిపి నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మదనపల్లె మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె మహేష్ బాబు, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, యువనాయకులు చరణ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో గాడు, వాడు వీడు అంటూ ఏకవచనంతో సంబోధించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నందమూరి బాలకృష్ణ చరిత్ర అందరికీ తెలుసుని, ఆడది కనబడితే ముద్దయినా పెట్టాలి.. లేదంటే కడుపైనా చేయాలని స్టేజీలపైన వాగి మహిళలోకంతో ఛీవాట్లు పెట్టించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. దివంగత వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా వై.ఎస్.జగన్ 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. కరోనా కష్టకాలంలో నవరత్నాలు, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచి, దేశ రాజకీయాలలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. విలువలు, విశ్వసనీయతకు జగన్ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మరోసారి కించ పరిచేవిధంగా వ్యాఖ్యలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

సమసమాజ స్థాపనకై పోరాడిన 'విశ్వకవి జాషువా'

ప్రజాశకి-కడప అర్బన్

'గబ్బిలం' లాంటి రచనలతో సమసమాజ స్థాపనకై పోరాడిన విశ్వకవి 'గుర్రం జాషువా' అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ శివారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా 131వ జయంతిని నిర్వహించింది. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ జాషువా సాహిత్యం పేదలు, పీడుతులు, కార్మికులు, కర్షకుల పక్షాణ నిలబడి ప్రశ్నించేలా ఉంటుందన్నారు. 'ఇచ్చోటనే' లాంటి పద్యాల్లో మనిషిలా సామాన్య జీవితం గడిపి మరణించకుండా తనకంటూ చరిత్రలో ఒకపుటను సంపాదించుకునేలా బతకాలన్న సందేశముందన్నారు. కఠిక పేదరికంలో పుట్టి శాసనమండలి సభ్యుడుగా ఎదిగిన జాషువా జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో పయనించేలా అభ్యుదయకోణంలో రచనలుచేసి 'నవయుగ కవిచక్రవర్తి'గా జాషువా కీర్తించబడ్డారన్నారు. సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ 1932లో పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి ఫిరదౌసి జీవితంపై ఫిరదౌసి కావ్యం వెలువరించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పుత్తా పుల్లారెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపి బ్రౌన్ పరిశోధకులు

ఎస్‌సి వర్గీకరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

-మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఎస్‌సి వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. ఆగస్టు 3న కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ఆదివారం మదనపల్లికి చేరుకుంది. నిమ్మనపల్లె క్రాస్ వద్ద మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతర అంబేద్కర్ విగ్రహం వరకు రాజ్యాంగ పరిరక్షణ మహా పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతామోహన్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మాల మాదిగలను విభజించడం, పల్లెల్లో చిచ్చు పెట్టడం, సామాజిక న్యాయం అవుతుందా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు ఓ డైరెక్షన్ ఇస్తే దాన్ని అడ్డు పెట్టుకుని దళితులను విభజించడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. ఎస్‌సి వర్గీకరణ ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉందని, ఎపి ప్రభుత్వం తెచ్చిన ఎస్‌సి వర్గీకరణ చెల్లదన్నారు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళలో, బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ జరగలేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోకుంటే, చంద్రబాబు పాలనకు ఇదే చివరి రోజులని హెచ్చరించారు. ఎస్‌సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 15శాతం నుంచి 20శాతం పెంచాలన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేసి, దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో దళిత నాయకులు, విద్యార్థి, యువజన సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మదనపల్లెలో షటిల్ ఆడిన ఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలో ఉదయం జిల్లా ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి, రాజంపేట ఎఎస్‌పి రామనాథ్ మనోజ్‌హెగ్డే స్థానికులతో కలిసి షటిల్ ఆడారు. శనివారం రాత్రి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలిహిల్స్‌కు వెళ్లిన ఎస్‌పి ఉదయాన్నే మదనపల్లెకు చేరుకున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని ఇండియన్ యూనియన్ క్లబ్‌లో స్థానికులతో కలిసి కొంతసేపు సరదాగా షటిల్ ఆడడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన ఎఆర్ డ్యాన్స్ అకాడమీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : హుయిన్ డ్యాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో కడప రథం నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలలో రాజంపేటకు చెందిన ఎఆర్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు జూనియర్స్ విభాగంలో సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందుకున్నట్లు డ్యాన్స్ మాస్టర్ బొజ్జ అభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూవీ కొరియోగ్రాఫర్ యశ్వంత్ మాస్టర్, ఢీ కార్తీక్ మహారాజ్ చేతులు మీదుగా ట్రోఫీ అందుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. తనకు అండగా నిలిచి ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, చెర్రీస్ అకాడమీ స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె : అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులను వైఎస్ఆర్ టిఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు వ్యవస్థాపక సభ్యులు జి.వి.ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విశ్రాంత ఉపాధ్యాయులు జివి.ప్రసాద్, మునిగోటి శ్రీనివాస శర్మలను కృష్ణారెడ్డి సిద్దార్థ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్‌రావు దుశ్శాలువాతో సన్మానించి సర్టిఫికెట్లు, మెమోం టోలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నాటి నుంచి నేటి వరకు సమాజంలో ప్రత్యేక స్థానాన్ని పొందారనన్నారు. ఎంతో మంది జీవితాలను మార్చేందుకు కృషి చేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. అనంతరం జివి.ప్రసాద్ మాట్లా డుతూ వైఎస్ఆర్ టిఎఫ్ తనను గుర్తించి అవార్డును ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యా విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. మునిగోటి శ్రీనివాసశర్మ క్రమశిక్షణ ప్రాధాన్యతపై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. మాజీ సర్పంచ్ వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి డి. మోహన్ రెడ్డి, విశ్రాంత ఎంఇఒ ఎల్. సుధ విశ్రాంత ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం మదనపల్లె డివిజన్ లోని వివిధ మండలాలకు చెందిన12 మంది విశ్రాంత ఉపాధ్యాయులు కాంతారావు, నిర్మల, గోపాల్ రెడ్డి, వెంకటరమణ, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మానవత భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, యం.నారాయణరెడ్డి, హైదర్‌వల్లి, సి. భాస్కరరెడ్డి, మణికంఠ వెంకటరమణ లను సత్కరిం చారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక సలహాదారు ఎం.ఎ. షరీఫ్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పర్యటించారు. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ లో జిల్లాకు చెందిన మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ముస్లిం మైనార్టీ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, జిల్లా, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై అవగాహన కల్పిం చారు. సమస్యలను నేరుగా నా దృష్టికి తీస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిం చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, మదనపల్లి, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులతో ఎంఎ షరీఫ్

పెద్దేరు ప్రాజెక్టు వద్ద సందడి చేస్తున్న యువత

పెద్దేరు ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కొటాల పంచాయతీలో నిర్మించిన పెద్దేరు ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఈ మధ్య కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నుంచి మరువ పోతుంది. ఆదివారం ఆటవిడుపు కావడంతో పిల్లలు పెద్దలు ప్రాజెక్టు సందర్శించేందుకు వచ్చారు. మరువనీటిలో యువత, పిల్లలు జలకాలాటలలో.... ఏమి హాయిలే అలా. అంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదాలకు చోటు ఇవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నందలూరు అరుంధతివాడలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తల పని తీరు ప్రశంసించి ఇద్దరు ఉత్తమ కార్య కర్తలకు నగదు బహుమతి అందించారు. ఎన్ఎస్ఎస్ కార్య కర్తలు సేవలో ముందు వుంటారని జీవన నైపుణ్యాలు, విలువలు పెంపొందించుకొంటారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ నీలవేణి మాట్లాడుతూ సమాజం నుండి కార్య కర్తలు చాలా నేర్చుకొంటారని, విద్యలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అంత ర్భాగమని తెలిపారు. కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో రమేష్, శివశంకర్, నాగరాజ రాజమ్మ స్థానికులు పాల్గొన్నారు. ఓటు గురించి, ఓటర్ల చైతన్యం గురించి ర్యాలీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బాలకృష్ణను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలి

ప్రజాశక్తి-కలికిరి

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణపై పీలేరు నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సభ్య సమాజం తలదిం చుకునేలా ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై చేసిన సైకో గాడు' అనే వాఖ్యలతో తూల నాడడంను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూ అసెంబ్లీలో బాలకృష్ణ తీరు చూశాక ఇకపై అసెంబ్లీకి వచ్చే సభ్యులకి మెంటల్, బ్రీత్, అనలైజర్ పరీక్షలు చేయాల్సి అవసరముందన్నారు. సినిమాలు తీయడానికి తప్ప ఎమ్మెల్యేగా అర్హుడా కదా ఆయనే ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. మూడేళ్లుగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి మీద జరుగుతున్న దుష్ప్రచారానికి తెరతీస్తూ, సొంత అన్నలా చూసుకు న్నారని చిరంజీవి లేఖ రాసినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.

బూత్ కమిటీ అధ్యక్షుడిగా మంజునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వైసిపి పెద్దతిప్పసముద్రం మండల బూత్ కమిటీ అధ్యక్షుడిగా పిటిఎం మండలానికి చెందిన కె.మంజునాథ్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కె.మంజునాథ్‌రెడ్డి, మాట్లాడుతూ తమపై నమ్మకంతో నాకు మండల బూత్ కమిటీ అధ్యక్షుడుగా పదవి అప్పగించినందుకు వై.ఎస్.జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరికి తెలిపారు. మండల పరిధిలోని వైసిపిని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, 2029లో వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చి, మరోసారి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకో వడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. తనుకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన యంత్ర 2కె25 శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో మెకానికల్ విభాగానికి సంబంధించి మూడు రోజుల యంత్ర2 కె-25 జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపుసభకు ముఖ్యఅతిధులుగా పి.శ్రీనివాసరెడ్డి, హర్షవర్ధన్, వి.అజయ్‌తేజా హాజరయ్యారు. సభలో కళాశాల మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ట్రైనర్స్ సాయి నాగార్జున, అబ్దుల్ ఖాదర్, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

5న ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు :

అక్టోబర్ 5న ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు అవార్డు టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రమణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్కృతి సేవా సంస్థతోపాటు అవార్డు టీచర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు పొందినవారికి ఆత్మీయ సత్కార సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 స్వీకరించిన ఉపా ధ్యాయులందరూ సన్మాన సభకు హాజరుకావాలని కోరారు. అదనపు సమాచారాన్ని 9440507133 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సూపర్‌సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

సూపర్‌సిక్స్ హామీలు సూపర్ హిట్ అని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కూటమి ఇచ్చిన ప్రధాన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇవ్వలేదన్నారు. ఒక్కో నిరుద్యోగికి 15 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.45వేలు ఎగ్గొట్టిందని చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్నట్లు చెప్పారు. యువతను టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసిరెడ్డి విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద 19-59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇంత వరకు అ పథకం అడ్రస్ లేదన్నారు. రాష్ట్రంలో 1 కోటి 80 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

మదనపల్లి : బహుమతులు అందుకున్న విద్యార్థులతో కవితారాణి

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక దేవత నగర్ లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ సూచనలతో, జనరల్ సెక్రటరీ కవితారాణి, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల చిన్నారులు కలిసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవితా రాణి మాట్లాడుతూ, భయమనే ఆలోచన మనసులోకి రానీయొద్దు, అది మనల్ని పిరికివారిగా మారుస్తుంది. మనుషులను చంపగలరు కానీ వారి ఆలోచనలను, ఆదర్శాలను ఎన్నడూ చంపలేరు" అనే భగత్‌సింగ్ మాటలు నేటికీ యువతలో దేశభక్తి జ్వాలను రగిలిస్తున్నారు. చిన్నారులు ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలతో భగత్‌సింగ్ స్ఫూర్తిని స్మరించు కున్నారు. పాటలు, ఉపన్యాసాలతో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

భగత్ సింగ్, గుర్రం జాషువాకు నివాళులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని బచ్చు భవన్‌లో దేశం గర్వించదగ్గ ఇరువురు మహనీయులు భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కరరావు అధ్యక్షతన ఆదివారం నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ గుర్రం జాషువా పల్నాడు ప్రాంతంలో జన్మించారని వారు తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై జలుపిస్తూ సుప్రసిద్ధ నవలలు గబ్బిలం, పిరదోసి లాంటి ప్రాముఖ్యత పొందిన నవలల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే ప్రయత్నం చేశారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు జయ భాస్కరరావు, కుర్రా మణి యాదవ్, ఉప్పు శెట్టి సుధీర్, మోడపోతుల రాము, మంటి మారయ్య,గండికోట కృష్ణ కుమార్, ఆంజనేయులు, తీగల కుంట వెంకటేష్ పాల్గొన్నారు.

నందలూరు : భగత్‌సింగ్, గుర్రంజాషువా చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న

వైభవంగా దసరా ఉత్సవాలు

నందలూరు : గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి-నందలూరు : శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వరోజు ఆదివారం గాయత్రీ దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురో హితులు బండాత్మకూర్ శివకుమార్‌శర్మ ఆధ్వ ర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్ర నామ కుంకుమార్చన కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం** :వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి కోటలో వెలసిన శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో మహా చండీ అవతారంలో సత్యమ్మ తల్లి దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అర్చన, అభిషేకాలు, అలంకరణ గావించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొ క్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, చక్రపాణి, రమేష్, పూజారి ఉత్తన్న పాల్గొన్నారు.

శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి సన్నిధిలో 'బత్యాల'

రాజంపేట అర్బన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజంపేట పట్టణంలోని శ్రీ మత్కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉత్సవ కమిటీ వారి ఆహ్వానం మేరకు ఆదివారం శ్రీ గాయత్రిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగలరాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వ హించి అమ్మవారి శాలువా, పూలమాలతో బత్యాలను ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్ర సాదాలు అందజేసి ఆశీర్వదించారు.కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. **కలికిరి:** గ్రామదేవత ఎల్లమ్మ అమ్మవారు ఏడవ రోజున మహా చండి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామదేవత ఎల్లమ్మ, సోమేశ్వర ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రులను పురస్కరించుకొని కలికిరి ఎల్లమ్మ ఆలయం చైర్మన్ రెడ్డి వారి అశోక్ రెడ్డి, సోమేశ్వర ఆలయం చైర్మన్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ రకాలైన పూలు, పండ్లు తో ప్రత్యేకంగా అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. అనం తరం పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.

రాజంపేట :బత్యాల చెంగల్‌రాయుడును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కలకడ : దౌలత్‌ఖాన్ పల్లెలో వైద్య శిబిరానికి హాజరైన రోగులు

ప్రజాశక్తి- కలకడ/గుర్రంకొండ

గుర్రంకొండ మండలంలో దౌలత్‌ఖాన్‌పల్లెలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుర్రంకొండ మండలంలోని దౌలత్‌ఖాన్‌పల్లెలో ఆదివారం ఎస్ఎల్‌టి బాబ్జాన్ ఆధ్వర్యంలో భారీ వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి సలహా మేరకు జరుగగా, స్థానిక ప్రజలు విశేషంగా స్పందించారు. గ్రామంలో మొత్తం 300 ఇండ్లుండగా, దాదాపు 200మంది రోగులు ఈ శిబిరంలో పాల్గొని వైద్యం పొందారు. బిపి, షుగర్, చిన్న పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులకు చికిత్స అందించబడింది. 30 రకాల మాత్రలు, 10 రకాల సిరప్‌లను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎల్.టి బాబ్జాన్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు తరచుగా నిర్వహించడం జరుగుతుంది. గతంలో చిట్టిబోయినపల్లిలో శిబిరం నిర్వహించాం. రాబోయే రోజుల్లో తల్లారి వారి పల్లిలో కూడా వైద్య శిబిరం చేపట్టనున్నాం" అని తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.గంగాధర్ జనరల్ మెడిసిన్, షుగర్ వ్యాధుల పరీక్షలు, చికిత్స, సలహాలు,డా. వి. వసీం అక్రమ్ రూట్ కెనాల్, దంత సమస్యలు, సౌందర్య దంత చికిత్సలు, డాక్టర్ ఎస్.కె. అక్బర్ మొహ గ్రామస్తులు రోగులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలో దుర్గామాత నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మదనపల్లి సిఎంవి చిన్నపిల్లలు జనరల్ హాస్పిటల్ వారి సహకారంతో వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ చౌడిశెట్టి, డాక్టర్ బృందా నేతృత్వంలో బి.కొత్తకోట జ్యోతి బస్టాండ్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి చిన్నపిల్లలకు ప్రజలకు వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.

బి.కొత్తకోట : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అధికారులు సమస్యలపై స్పందించాలి : ఎంపిపి

మాట్లాడుతున్న ఎంపిపి సతీష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజాప్రతినిధులు సమస్యలు చెప్పినప్పుడు అధికారులు గౌరవంగా మాట్లాడి సమాధానం ఇవ్వాలని, ఫిర్యాదులు మళ్ళీ వస్తే పరిస్థితి మరోలా ఉంటుందని ఎంపిపి సతీష్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ఆదివారం ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీలేరు పట్టణంలోని కడప రోడ్డులో కొందరు యువకులు గంజాయి సేవించి ద్విచక్రవాహనాలపై ఫీట్లు చేస్తూ, ఇతర వాహనదారులు, పాదచారులను భయాందోళనలకు గురి చేస్తున్నారంటూ స్థానికులు తన దృష్టికి తెచ్చారని పీలేరు మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉదయ్ కుమార్ ఎస్ఐ రహీంకు తెలిపారు. ఎంపిటిసి సుభాషిణి మాట్లాడుతూ రేగళ్ల పంచాయతీ బోడిదొడ్డిపల్లెలో బోరు తవ్వించి రెండేళ్లు దాటుతున్నా ఇప్పటికీ విద్యుత్ మోటరు అమర్చలేదన్నారు. కాకులారంపల్లి సర్పంచ్ హరిణి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ వాసులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నా పైపులు ఏర్పాటు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. నూనేవాండ్లపల్లెకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోరు తవ్వి మూడేళ్లు కావస్తున్నా విద్యుత్ మోటారు ఏర్పాటు చేయక పోవడంతో బోరు నిరుపయోగంగా మారిందని మండల మరో సభ్యుడు దామోదర చెప్పారు. ఎర్రగుంటపల్లె పంచాయతీ ముడుపుల వేములలో 10 కెవి విద్యుత్తు తీగలు దిగువన వెళ్తున్నాయని ఎంపిటిసి సభ్యుడు అమరనాథ రెడ్డి చెప్పారు. గూడరేవుపల్లె పంచాయతీలో విద్యుత్తు ఉపకేంద్రం ప్రారంభించిన అధికారులు ఆ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న తనను ఆహ్వానించలేదని జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. వేపులబైలు పాడి రైతులు గడ్డి సాగుచేసినా ఉపాధి హామి పథకంలో బిల్లులు ఇవ్వడం లేదని సభ్యుడు మదుసూదన్ రెడ్డి ఆరోపించారు. మదనపల్లె మార్గంలో ఎపిఐఐసి లేఅవుట్-3లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నా బిల్లులు మంజూరులో జాప్యం జరుగుతోందని వైఎస్ ఎంపిపి రైల్వే చలపతి తెలియజేశారు. మండల సమావేశానికి అధికారులు తప్పక హాజరుకావాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాజేశ్వరి స్పష్టం చేశారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాషా, ఎంపిటిసిలు, సర్పంచులు, ఎంఇఒ లోకేశ్వరరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప, ఏవో రమాదేవి, ట్రాన్స్‌కో, ఆర్డబ్ల్యూఎస్ ఎఇలు ఖాదర్ ఇలాహి, ఇరగన్న, రమణయ్య, డాక్టర్ రాధా మాధవి పాల్గొన్నారు.

పిల్లలపై కుక్కల దాడి

-పట్టని అధికారులు

ప్రజాశక్తి - వాల్మీకిపురం

చిన్నా, పెద్ద తేడా లేకుండా పిక్కలు పట్టి లాగేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సైతం బండమకాన్ వీధిలో వెళ్తున్న ఓ పిల్లాడి కాలును కుక్కలు పట్టుకున్నాయి. పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండడంతో

కుక్కకాటుకు గాయపడిన బాలుడి పాదాలు

ప్రజలు, పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే అనేక మార్లు పిల్లలపై కుక్కల దాడులు జరిగినప్పటికీ ఎవరు పట్టించుకోక పోవడంతో ప్రజ లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మనుషుల ప్రాణాల కన్నా కుక్కలపై మోజు ఎక్కువ అయిపోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ సంబంధిత అధి కారులు కుక్కల విషయంలో ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు చోటు చేసుకుం టున్నాయి.

రాజంపేట : కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్యులు

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రేబిస్ వ్యాధి ప్రాణాంతకమని, అవగాహనతో ఆ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొబైల్ అంబులెన్స్ వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, మణి, దత్తాత్రేయ, హరిబాబు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** రేబిస్ నివారణా దినోత్సవం సందర్భంగా తంబళ్లపల్లె పశువైద్య శాలలో ఆదివారం పశుసంవర్ధక శాఖ ఎడి సుమిత్ర, మండల పశు వైద్యులు విక్రం రెడ్డిల ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్‌వ్యాధి నివారణ టీకాలు వేయించారు. మండలంలో సుమారు 30 పెంపుడు కుక్కలకు రాబిస్ వైరస్ సోకకుండా ముందస్తుగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం రాబిస్ వైరస్ సోకితే కలిగే లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వివరించారు. రాబిస్ (కుక్కకాటు వ్యాధి) లక్షణాలు ప్రారంభంలో జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, కాటు ఉన్న ప్రదేశంలో జలదరింపు వంటి ఫ్లూ లాంటి లక్షణాలతో మొదలవుతాయి. వ్యాధి ముదిరే కొద్దీ ఆందోళన, గందరగోళం, భ్రాంతులు, నిద్రలేమి, అసాధారణ ప్రవర్తన, నీటి భయం, మరియు పక్షవాతం వంటివి కనిపిస్తాయి, చివరికి కోమా మరియు మతిస్థిమితం కోల్పోవడానికి దారితీస్తుందన్నారు కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఆగిన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తి కావస్తున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వైసిపి డిజిటల్ బుక్‌కు సంబంధించిన స్కానింగ్ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అనకుంటలో నిర్మాణానికి నోచుకోని బాలికల పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదు కూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇరుకుగా ఉందని, బాలికల పాఠశాల ఏర్పాటు చేయించి, సిబ్బందిని కూడా సమకూర్చామన్నారు. భవణాలు లేకపోతే అన్యాక్రాంతమయ్యే స్థలంలో బిల్డింగ్ నిర్మాణం చేపట్టి 70శాతం పూర్తి చేశామన్నారు. మిగిలి ఉన్న పనులను ఈ16 నెలల కాలంలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి తగినంత సిబ్బంది, నిర్మాణానికి 5ఎకరాల భూమిని కేటా యించామన్నారు. శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. బిల్డింగ్ కోసం నాబార్డు కింద రూ.34 కోట్ల 90 లక్షలు మంజూరై టెండర్లు పిలవ కుండా కాలయాపన చేస్తున్నారన్నారు. డిఎస్‌సి ప్రతి సంవత్సరం జరిగేదే దానికి విజయవాడకు పిలిచి హంగామా చేశారని ఎద్దేవా చేశారు. గత ప్రభు త్వంలో లక్షా నలభై వేల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పెన్షన్లు తమ వాలంటీర్లు ఇచ్చేవారని, నేడు ముఖ్యమంత్రి ఇస్తున్నారన్నారు. సోషల్ మీడియాపై కేసులు పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. టైం వస్తే చేతులకు కూడా దొరకరన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వంద శాతం మళ్లీ జగన్ సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లింగన్న, భరత్, షరీఫ్, జ్వాల, సుబ్బయ్య, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కార్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. గ్రామ సచి వాల యాల వ్యవస్థ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా కనీస వసతులు మాత్రం సమ కూర్చలేదు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని చెముల్లపల్లె గ్రామ సచి వాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ నిర్మించిన కార్యాలయ మరుగుదొడ్డి నీటి సదుపాయానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మహిళలు, పురు షులకు వేర్వేరుగా మరుగుదొడ్డిని నిర్మించినా ప్రయోజనం లేకుండా ఉంది. పం చాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కార్యాలయానికి వచ్చే ప్రజలు వాపోతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి నీటి వసతి కల్పించి మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరు తున్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు, మందులు పంపిణీ

ప్రజాశక్తి - వేముల : వేముల పిహెచ్‌సిలో ఆదివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో డాక్టర్ శరణ్య మాట్లాడుతూ మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవగాహనా కల్పించారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది,కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించడం హర్షణీయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :విద్యార్థుల ప్రతిభను గుర్తించడం హర్షణీయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇస్తా వేదికగా ఆదివారం 62వ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పిల్లల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్న యుఎస్ఒ సంస్థకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ మీనా జైన్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ బూమ్రా, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దాసరి భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

తిరుపతి ఇస్కాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంస్థ దేవాలయాల ప్రధాన అర్చకులు గోవర్ధన్ విహారి దాస్, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ ఎమ్మెల్సీ రాం గోపాల్‌రెడ్డిని కోరారు. పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయ నను కలిసి పట్టణంలో ఆలయ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ ఈ అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని తెలిపారు

క్రైం కార్నర్

మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కలకడ

రెడ్డిప్రసాద్(ఫైల్ ఫొటో)

మనస్థాపానికి గురై విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.మండలంలోని కోన పంచాయతీ కోనకు చెందిన శివశంకర్ కుమారుడు రెడ్డి ప్రసాద్ (19) ఇంటర్మీడియట్ ఫైల్ అయ్యి రాయచోటి నందుగల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఐటిఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ చదువుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం తాను ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టుకు ఫీజు కట్టడానికి డబ్బులను తన తండ్రిని అడిగినట్లు తెలిపారు. ఈరోజు లేదు రేపు డబ్బులు కడదాం లేనని తండ్రి చెప్పడంతో మనస్థాపన గురైన రెడ్డి ప్రసాద్ బావి వద్దకు వెళ్లి గడ్డి మందు సేవించడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కలకడ 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రూయా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుడి తండ్రి శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు.